

# నేను - నా జ్ఞాపకాలు

## - జీడిగుంట రామచంద్రమూర్తి



*రచనా కాలం : 2019*

*(గత సంచిక తరువాయి)*

1961 ఏప్రిల్ 20 వతేదీన నా వివాహం జరిగిపోయింది. భార్య రాజ్యలక్ష్మితో వరంగల్లులో, వేరే చిన్నవాటా అద్దెకు తీసుకుని కాపురం పెట్టేశాను. 1962 ఆగస్టు నెలలో మాకు మొదటి అబ్బాయి జన్మించాడు. వానికి 'విజయసారథి' అని పేరు పెట్టాం. ఆ వేళా విశేషం ఏమిటోగానీ, అంతకు మూడునెలలముందే రాసిన ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ పరీక్ష నేను పాసవటం కాకినాడలోని విద్యాశాఖలో నాకు పర్మనెంటు ఉద్యోగం రావటం జరిగింది. దాంతో మా మకాం వరంగల్లు నుంచి కాకినాడకు మారింది.

అన్నట్టు ఇక్కడ ఓ సంగతి చెప్పటం మరిచిపోయాను. నేను వరంగల్లులో పనిచేసే రోజుల్లో వారపత్రికలు బాగా చదువుతుండేవాణ్ణి. నాక్కూడా కథా రచనపట్ల ఆసక్తి ఏర్పడి, కథలు రాయటం ప్రారంభించి, పత్రికలకు పంపుతూండేవాణ్ణి. చాలా కథలు క్షేమంగా తిరిగి వస్తూండేవి. నేను మాత్రం పట్టు వదలని విక్రమార్కుణ్ణే అయ్యాను. అది 1960వ సంవత్సరం. డిసెంబర్ నెల. అప్పుడు ఆంధ్రవారపత్రికకు నేను రాసిన 'హంసగమన' అనే కథ ప్రచురించబడింది. విశేషం ఏమిటంటే అది పత్రికలో 'మధ్య పేజీ కథ' అలా మధ్య పేజీ కథలకి అప్పట్లో 'బాపు'గారు బొమ్మలు వేసేవారు. ఇంకేముంది? బాపు బొమ్మతో మధ్య పేజీ కథగా అది రావటంతో నా ఆనందానికి అవధులు లేకుండాపోయాయి. ఆ ఊపులో ఊపుగా మరో నాలుగైదు కథలు రాసి వేర్వేరు పత్రికలకు పంపించాను. అవి కూడా ప్రచురితమయ్యాయి.

నేను కాకినాడ ఉద్యోగంలో చేరిన తర్వాత కూడా కొన్ని కథలు రాశాను. అప్పటిదాకా వచ్చిన కథల్ని "ప్రేమకు మిగిలింది" పేరుతో ఒక సంపుటిగా 1965లో, అమలాపురంలోని శ్రీనివాస పబ్లిషింగ్ హౌస్ వారు ప్రచురించారు. కథలు రాయటంలో రవ్వంత అనుభవం సంపాదించినవాణ్ణి, 'నవల ఎందుకు రాయకూడదూ' అనే ఆలోచనతో నవలా రచనకు శ్రీకారం చుట్టాను. ఓ నెలరోజుల వ్యవధిలో 'జీవనవాహిని' పేరుతో నవల రాశాను.

అప్పటికి నేను కాకినాడనుంచి రాజమండ్రికి బదిలీ అయివచ్చాను. నేను వుంటున్న ఇంటికి ఎదురుగా ఓ సుప్రసిద్ధ రచయిత్రి వుండేవారు. ఎన్నో నవలలు రాశారావిడ. వాటిలో ఒకటో రెండో సినిమాలుగా కూడా వచ్చాయి. నేను రాసిన 'జీవన వాహిని' నవలపై అభిప్రాయం రాయించుకుని అది కూడా ప్రచురించాలన్న ఉద్దేశ్యంతో వారింటికి వెళ్ళాను. కానీ రచయిత్రి దర్శనభాగ్యమే నాకు లభించలేదు. ఎవరి అభిప్రాయాలతోనూ పనిలేకుండా నా నవలను ప్రచురణకు ఇచ్చాను. అంతకుముందు నా కథల సంపుటిని ప్రచురించిన 'పబ్లిషింగ్' సంస్థవారే నా నవలను కూడా ప్రచురించారు.

విద్యాశాఖలో పనిచేసిన మొత్తం తొమ్మిదేళ్ళ వ్యవధిలో నాకు మరో ఇద్దరు అబ్బాయిలు పుట్టారు. శ్రీధర్, వేణుగోపాల్ అనే పేర్లు పెట్టుకున్నాం. కుటుంబంతోపాటు అవసరాలు పెరిగాయి. గుమస్తా ఉద్యోగం చేస్తూ నెలకు తొంభై రూపాయల జీతం తెచ్చుకుంటూ ఆ

అవసరాలను తీర్చుకోవటం కష్టమైంది. జీతం పెంచుకోవాలంటే ప్రమోషన్ తెచ్చుకోవాలిగా? ఇంటర్ పరీక్ష ఫెయిలయినవాడిని. ప్రమోషన్ వచ్చే అవకాశాలు లేకపోయాయి. వెంటనే ఓ ఆలోచన వచ్చింది. నేను ఫెయిలయిన 'సైన్స్' గ్రూపు మార్చుకుని ఆర్ట్స్ గ్రూపుతో ప్రయివేటుగా మళ్ళీ ఇంటరు పరీక్ష రాశాను. అది పాసవటంతో ఉత్సాహం పెరిగి బి.ఏ పరీక్షక్కూడా ప్రిపేరయి కేవలం రెండేళ్ళ వ్యవధిలో ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి పట్టా తీసుకున్నాను.

ఆ రోజుల్లో విద్యాశాఖలో అయిదేళ్ళు పనిచేసి డిగ్రీని కలిగిన ఉద్యోగులు సెలవుపై బి.ఇడి ట్రైనింగ్ అయ్యే అవకాశాలుండేవి. సరే, నేను కూడా దరఖాస్తు చేసుకున్నాను. రాజమండ్రిలోనే వున్న బి.ఇడి ట్రైనింగ్ పూర్తిచేశాను. ఇక త్వరలో ప్రమోషను వస్తుందని ఎదురు చూస్తున్నాను.

అది 1971వ సంవత్సరం. ఒకరోజు పేపర్లో ఒక ప్రకటన వచ్చింది. హైదరాబాద్ ఆకాశవాణి కేంద్రంలో 'స్క్రిప్టు రైటర్'గా పనిచేయటానికి అర్హతగల అభ్యర్థులనుంచి దరఖాస్తులు కోరబడుతున్నాయన్నది ఆ ప్రకటన సారాంశం. అది కేంద్రప్రభుత్వ ఉద్యోగం. జీతంకూడా ఎక్కువ. అది వస్తే బాగానే వుంటుందన్న అభిప్రాయంతో దరఖాస్తు పంపుకున్నాను.

అప్పటికి నేను ప్రమోషన్ కోసం ఎదురుచూస్తూనే రాజోలు కళాశాలలో 'క్లర్కు'గా ఉద్యోగం చేస్తూనే వున్నాను. ఆకాశవాణిలో స్క్రిప్టు రైటర్ పోస్టుకి నేను పంపుకున్న దరఖాస్తు చూసి నన్ను ఇంటర్వ్యూకి పిలిచారు. ఆ ఉద్యోగం వస్తుందన్న ఆశలేశమైనా లేకపోయినా, హైదరాబాద్‌లో వుంటున్న మా బంధు బలగాన్ని ఓసారి చూసి రావచ్చునన్న ఆలోచనతో ఇంటర్వ్యూకి హాజరయ్యాను. ముందు లిఖిత పరీక్ష నిర్వహించారు. హేమాహేమీలు పదిహేనుమందికి పైగా ఆ పరీక్ష రాశారు. అందులో కొందరితోపాటు నేనూ పాసయ్యాను. పాసయిన పదిమందికి మౌఖిక పరీక్ష ఏర్పాటు చేశారు. దానికీ హాజరయ్యాను ఆ పరీక్షలో నన్ను స్టేషన్ డైరెక్టరు, కందస్వామిగారితోపాటు, ప్రసిద్ధ కవులు సర్వశ్రీ దివాకర్ల వెంకటావధాని, దాశరథి, లలిత సంగీత స్వామాట్టుగా పేరుపొందిన శ్రీ బాలాంత్రపు రజనీకాంతరావుగార్లు రకరకాల ప్రశ్నలు అడిగారు. అన్నింటికీ తడుముకోకుండా సమాధానాలు చెప్పాను. ఇంటర్వ్యూకి హాజరైనవారిలో నాకంటే విద్వత్తూ ఆకాశవాణిలో పూర్వ అనుభవం కలిగినవారూ, మరో ఇద్దరి ముగ్గురిపేర్లు వినిపించినా ఆ ఉద్యోగం నన్నే వరించింది. అది కాంట్రాక్టు ఉద్యోగమనే విషయాన్ని అప్పుడే తెలియజేశారు. పైగా అప్పటిదాకా ఏదైనా ఉద్యోగం చేస్తుంటే దానికి రాజీనామా చేసి ఈ ఉద్యోగంలో చేరాలని కూడా చెప్పారు. నేను, నా స్టేట్ గవర్నమెంట్ ఉద్యోగానికి రిజైన్ చేయకుండా 'లీవ్' తీసుకుని వచ్చినవాణ్ణి.

ఏం చేయాలో తోచలేదు. అప్పటిదాకా చేస్తున్న ఆ గవర్నమెంట్ ఉద్యోగం వదులుకుని రేడియోలో ఈ కాంట్రాక్టు ఉద్యోగం చేయటమా, మానటమా? అనే ప్రశ్న తలెత్తింది. అప్పట్లోనే స్క్రిప్టు రైటర్‌గా హైదరాబాద్ కేంద్రంలోనే పనిచేస్తున్న శ్రీ రావూరి భరద్వాజ గారి ఇంట్లో నా చెల్లెలూ, బావా అద్దెకు వుండేవారు.

"ఎందుకైనా మంచిది, భరద్వాజగారి సలహా తీసుకోరా అన్నయ్యా" అని నా చెల్లెలు ఓ సలహా ఇచ్చింది. వెంటనే వారిని కలిసి, నా ఆర్డరు చూపించి "ఏం చేయమంటారూ?" అని అడిగాను.

ఆయన రెండు నిమిషాలు ఆలోచించి "గవర్నమెంటు ఉద్యోగం వదులుకుని, కాంట్రాక్టుపై వచ్చే ఈ 'స్టాఫ్ ఆర్టిస్టు' ఉద్యోగానికి రావటం మంచిది కాదనిపిస్తోందయ్యా" అన్నారు.

"పైగా ఆ ఉద్యోగంలో రిటైర్ అయ్యాక పెన్షన్ కూడా వస్తుంది. ఈ ఉద్యోగంలో ఆ సౌకర్యం వుండదు. ఆలోచించుకో" అన్నారాయన.

నేను సందిగ్ధంలో పడ్డాను. ఆ సాయంత్రం హైదరాబాద్‌లోనే వుంటున్న నా పెద్ద మావయ్య పాలకోడేటి రామచంద్రరావుగారింటికి వెళ్ళాను. జరిగిన సంగతి యావత్తూ యదాలాపంగానే ఆయనకు చెప్పాను.

"ఆకాశవాణిలో ఉద్యోగం అంటే మాటలు కాదురా. అసలు ఆ ప్రాంగణంలో మేమైతే కాలు కూడా పెట్టలేం. అది దేవలోకంలాంటిది. గోపీచంద్‌గారూ, మునిమాణిక్యంగారూ, స్థానం నరసింహారావుగారు - ఇలా ఎందరో ఉద్దండులు పనిచేశారక్కడ. అయినా కాకిలా కలకాలం జీవించేకంటే హంసలా ఆరునెలలు బ్రతికినా చాలురా. ఒకవేళ ఇప్పుడు నీకిచ్చే ఉద్యోగం రేపు ఎప్పుడైనా కాంట్రాక్టు కాలం తీరిపోయి, ఊడిపోతే నా ఇంట్లో ఓ గది ఇస్తాను. నువ్వు ఎలాగూ బి.యిడి పాసయ్యావు కనుక ఆ గదిలో ఓ ట్యుటోరియల్ స్కూలు పెట్టుకో" అన్నారు నా మేనమామ.

ఆ ప్రోత్సాహమే నా వెన్ను తట్టింది. నేను వెంటనే మళ్ళీ రాజోలు వెళ్ళి అక్కడి కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ అన్నాప్రగడ లక్ష్మీనారాయణగారికి నా రాజీనామా పత్రాన్ని అందచేసి, తిరిగి హైదరాబాద్ వచ్చాను. 1971 డిసెంబర్ 9వతేదీన, స్క్రిప్టు రైటరు ఉద్యోగంలో చేరుతున్నట్టు జాయినింగ్ రిపోర్టు ఇచ్చాను.

నా సంగతి ఎలా వున్నా, మా ఇంట్లోవాళ్ళూ, అత్తవారింట్లోవాళ్ళూ కొంచెం కంగారు పడ్డారు. ఒకవైపు నాకు ముగ్గురు పిల్లలున్నారు అప్పటికి పెద్దవాడు అయిదోక్లాసు, రెండోవాడు మూడవతరగతి, చిన్నవాడు ఒకటో తరగతి చదువుతున్నారు. రేపెప్పుడైనా నా కాంట్రాక్ట్ పూర్తయి, వాళ్ళకు నేను నచ్చక నన్ను ఉద్యోగంలోంచి తీసేస్తే ముఖ్యంగా పిల్లల భవిష్యత్తు ఏమైపోతుందోనన్న భయం వాళ్ళది. నాకూ ఏమూలనో ఆ భయం కొంచెం వున్నా నాకు తృప్తినిచ్చే ఉద్యోగం దొరికింది కదా అన్న ధైర్యం ఆ భయాన్ని పారద్రోలింది.

అదే ధైర్యంతో నా కుటుంబాన్ని 1972 మార్చిలో రాజోలునుంచి హైదరాబాద్‌కి తీసుకొచ్చి, నాంపల్లి స్టేషన్ వెనుకవైపున వున్న విజయనగర కాలనీలో ఓ చిన్నవాటా అద్దెకు తీసుకుని కాపురం పెట్టాను. ఆకాశవాణిలో పనిచేసే రావూరి భరద్వాజగారు, మల్లాది నరసింహాశాస్త్రిగారు, పాకాల సావిత్రిగారు, పన్యాల రంగనాథరావుగారు ఆ కాలనీలోనే నివాసాలుండేవారు. వారు మాత్రమే కాదు. ప్రముఖ కార్టూనిస్ట్ శ్రీ బి.వి సత్యమూర్తి, మరో కార్టూనిస్ట్ శ్రీ మల్లిక్, ప్రముఖ మెజీషియన్ (అప్పట్లో) శ్రీ బి.వి పట్టాభిరాం, ప్రముఖ రచయితలు శ్రీ యండమూరి వీరేంద్రనాథ్, శ్రీ బి.వి.రమణారావ్, ప్రముఖ పాత్రికేయులు శ్రీ పొత్తూరి వెంకటేశ్వరరావు మొదలైనవారు కూడా నేను నివాసముండే ఇంటికి చుట్టుపక్కలే వుంటూండేవారు. (వారిలో కొందరు ప్రస్తుతం వేరే కాలనీలకు తరలి వెళ్ళారు. మరికొందరు స్వర్గస్థులయ్యారు) ఏది ఏమైతేనేం అప్పట్లో ఎవరైనా "మీరు ఎక్కడ వుంటున్నారూ?" అని అడిగితే, "విజయనగర కాలనీ" అని చెప్పటానికి బదులు ఉత్సాహంగా "విజయనగర సామ్రాజ్యం" అని చెప్పుండేవాడిని. అదో గర్వంగా ఫీలయ్యేవాడిని.

మొత్తానికి ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం నన్ను తన కౌగిట్లో చేర్చుకుంది. స్క్రిప్టు రైటరుగా, కుటుంబ నియంత్రణ శాఖను కేటాయించింది. 'తెలుగు హాలు' అని పిలవబడే ఓ విశాలమైన స్థావరంలో నాకు సీటు చూపించారు. నా చుట్టూ ఒకరూ ఇద్దరూ కాదు - ఎందరో మహామహులు కూర్చుని వున్నారు. శ్రీయుతులు కేశవపంతుల నరసింహశాస్త్రి, వేలూరి సహజానంద, రావూరి భరద్వాజ, మల్లాది నరసింహశాస్త్రి (సినీ గేయ రచయిత రామకృష్ణశాస్త్రిగారి కుమారుడు) నండూరి విఠల్, చెరుకుమిల్లి భాస్కరరావు, కె. చిరంజీవి, శారదా శ్రీనివాసన్, ఎమ్.జి.శ్యామలాదేవి, జె.వరలక్ష్మి - ఇలా వారందరి మధ్యా కూర్చునే మహద్భాగ్యం నాకు లభించడం నా పూర్వజన్మ సుకృతంగా భావించాను. వృత్తిధర్మంగా కుటుంబ నియంత్రణకు సంబంధించి ఎంతోమంది వైద్యనిపుణుల్ని ఆకాశవాణికి ఆహ్వానించి వారి ఇంటర్వ్యూలను ప్రసారం చేయటంతోపాటు గొప్ప గొప్ప రచయితల చేతా, రచయిత్రుల చేతా కుటుంబ నియంత్రణను ప్రేరేపించే విధంగా కథలు, నాటికలు రాయించి రేడియో ద్వారా శ్రోతలకు వినిపించటం జరిగింది.

ఇక మరోవైపు నా కథారచనా ప్రస్థానం కూడా ఊపందుకుంది. ఆంధ్రప్రభ వారపత్రిక సంపాదకులు శ్రీ పొత్తూరి వెంకటేశ్వరరావుగారు, శ్రీ ఎల్లోరా, ఆంధ్రపత్రికలో పనిచేసే శ్రీ వీరాజీ యువ మాసపత్రికను చూస్తే శ్రీ చక్రపాణిగారి కుమారుడు (పేరు గుర్తులేదు) విపుల మాసపత్రిక నిర్వాహకులు శ్రీ చలసాని ప్రసాదరావు, స్వాతి వారపత్రిక సంపాదకులు శ్రీ వేమూరి బలరాం, ఆంధ్రభూమి సంపాదకులు శ్రీ సి. కనకాంబరరాజ్, నవ్య నిర్వాహకులు శ్రీ ఎన్. జగన్నాథశర్మ, సితార వారపత్రిక నిర్వాహకులు శ్రీ శ్రీకంఠమూర్తి, ఆంధ్రప్రదేశ్ మాసపత్రిక సంపాదకులు శ్రీ వల్లీశ్వర్ - ఇలా ఎందరో నా వెన్నుతట్టి, నా రచనలు ప్రచురించి, నన్ను ప్రోత్సహించి రచయితగా నాకు రవ్వంత గుర్తింపును తెచ్చిపెట్టారని వారందరి పట్లా కృతజ్ఞతాభావంతో ఎప్పటికీ చెప్పుకుంటూనే వుంటాను. వారి ప్రోత్సాహమే లేకపోతే నాటినించి (1960) నేటిదాకా సుమారు 400 కథల్నీ, పది నవలల్నీ వంద పైచిలుకు వ్యాసాల్నీ రాసివుండేవాణ్ణికాదు.

ఇక రేడియో కార్యక్రమాల విషయానికొస్తే నాకెంతో గుర్తింపును తీసుకొచ్చింది. ఆదివారాల్లో మధ్యాహ్నంపూట ప్రసారమయిన కార్మికుల కార్యక్రమం. 'చిన్నక్క'(శ్రీమతి వి. రతన్‌ప్రసాద్) 'ఏకాంబరం' (డి. వి. సత్యనారాయణ)గార్లతో నేను 'బాలయ్య' పాత్రలో పాల్గొంటూ, ఆ కార్యక్రమంలో ప్రసారం కావటానికి 'పదినిమిషాల కబుర్లు' రాసేవాడిని. ముందు హాస్య సంభాషణతో ప్రారంభించి చివర్లో శ్రోతలకు ఉపయోగపడేవిధంగా ఓ చిన్న సందేశం వుండేది ఆ కబుర్లలో. సుమారు పధ్నాలుగేళ్ళు ఆ కార్యక్రమాన్ని నిర్వహించాను. అప్పట్లో టీవీలు ఇంకా గృహప్రవేశం చేయలేదుగా. అందుకే అందరూ రేడియో కార్యక్రమాలు తప్పనిసరిగా వింటూండేవారు.

ఈ కార్మికుల కార్యక్రమంలో బాలయ్యగా పాల్గొనే అవకాశం కూడా ఎలా వచ్చిందో చెప్పాలి. నాకంటే ముందు ఈ కార్యక్రమంలో చిన్నక్క, ఏకాంబరం పాత్రలతోపాటు రాంబాబు పాత్రధారిగా శ్రీ డి. వెంకట్రామయ్య పాల్గొనేవారు. ఆ కార్యక్రమానికి ఆయనే కబుర్లు రాస్తూండేవారు. ఆ కార్యక్రమానికి నేను పెద్ద అభిమానిని. అనుకోకుండా 1973లో అనుకుంటాను ఆయన ఆకాశవాణి వార్తా విభాగంలోకి న్యూస్ రీడర్‌గా వెళ్ళిపోయారు.

మరి 'ఈ కార్యక్రమానికి కబుర్లు ఎవరు రాయాలి?' అనే ప్రశ్న అధికారుల్లో తలెత్తింది. పోనీ కార్యక్రమం మానేద్దామా? అంటే ఎంతోమంది శ్రోతలకు నచ్చుతున్న కార్యక్రమం కదా.

అప్పుడే "క్రొత్తగా స్క్రిప్టు రైటర్‌గా చేరినాయన ఉన్నాడుగా? ఆయనతో రాయించండి" అన్నారు డైరెక్టరుగారు. ఆ కబుర్లలో రాంబాబు పాత్రలేదు కనుక 'బాలయ్య' పాత్ర ప్రవేశపెట్టాను. మరి బాలయ్య 'పాత్రకు రాసిన సంభాషణలు ఎవరు చెప్పాలి?' మళ్ళీ ప్రశ్న తలెత్తింది.

"ఆ 'రైటర్నే' చెప్పమనండి" అన్నారు డైరెక్టర్‌గారు.

***( కొనసాగింపు వచ్చేనెలలో)***

Post your comments